
దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి: 3 | సంచిక : 208 | సోమవారం 03. 8. 2026 | ఎడిటర్ వేములు అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00


## తెలంగాణను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నాం: డిప్యూటీ సీఎం



**తొలి సమయం హైదరాబాద్**

తెలంగాణలోని తమ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని, రాష్ట్ర రూపు రేఖలను మారుస్తూ ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశం అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్లో జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలను విదేశీ ప్రతినిధులు, ఎన్ఆర్ఐలకు భట్టి విక్రమార్క వివరించారు.

**3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం.. భారత్ ఫ్యూచర్ సిటీ...**

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లు, రాబోయే ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ప్లాన్‌ను అమలు చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. హైద రాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా ఫోర్త్ సిటీగా ముచ్చర్ల ప్రాంతంలో కాలుష్య రహిత నెట్–జీరో ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.



## కేటీఆర్ బహిరంగ లేఖ..!

### ఇంజనీర్లపై రేవంత్ రెడ్డి అభ్యంతరకర కామెంట్స్‌కు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి..

**తొలి సమయం హైదరాబాద్**

ఇంజనీరింగ్ విద్యార్థులనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభ్యంతరకర కామెంట్స్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, పార్టీ నేత రాహుల్‌కు కేటీఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఇంజనీరింగ్ విద్యార్థులను, ఇంజనీర్లను "క్రిమినల్ వేస్ట్" అన్న ముఖ్యమంత్రి కామెంట్స్‌పై రాహుల్ మౌనం వీడి క్షమాపణ చెప్పాలని, లేదంటే రేవంత్ వ్యాఖ్యలను సమర్థించినట్టే అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తేల్చి చెప్పారుఇంజనీర్లు, భారతదేశ ఇంజనీర్లు ప్రపంచ కంపెనీలను నడుపుతుంటే, అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతుంటే అలాంటి వారిని "క్రిమినల్ వేస్ట్" అని రేవంత్ రెడ్డి అంటున్నారని, దేశ ప్రగతికి పాటుపడుతూ లక్షల మందికి ఉద్యోగ -



మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు


## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి

- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్
- ప్రభుత్వం తరపున జగన్మాతకు పట్టువస్త్రాలు, బోనం సమర్పణ
- ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క
- అంగరంగ వైభవంగా జరుగుతున్న లష్కర్ బోనాల జాతర

**తొలి సమయం హైదరాబాద్**

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.






## మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 100 వారాల జాతీయస్థాయి కార్యక్రమం

### - ప్రారంభించిన ప్రధాని మోదీ

**తొలి సమయం హైదరాబాద్**

దేశంలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నూతన కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' పేరుతో సాగే 100 వారాల జాతీయస్థాయి కార్యక్రమాన్ని ఆదివారం ప్రధాని మోదీ న్యూఢిల్లీలో ప్రారంభించారు. దేశ యువత మాదకద్రవ్యాల వినియోగాన్ని వీడాలని, డ్రగ్ ఫ్రీ ఇండియా నిర్మాణంలో పాలుపంచుకోవాలని యువతను మోదీ కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రతివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తామని ప్రధాని అన్నారు. దేశాభివృద్ధికి, లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు మానసికంగా, శారీరకంగా ధృడత్వం కలిగిన యువత అవసరమని మోదీ అభిప్రాయపడ్డారు. 'జన్ భాగిదారి' పేరుతో మొదట 100 వారాల ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

### యూపీలో బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత

## 26,000 స్కూళ్లు మూసేశారు



ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 26,000 ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీలైన 'పీడీఏ' వర్గాల పిల్లలకు విద్యను దూరం చేయడమే ఈ చర్య ఉద్దేశమని ఆయన విమర్శించారు. ఆదివారం లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. అధికారిక గణాంకాల ప్రకారం బీజేపీ అధికారంలోకి వచ్చిన 2017 మార్చి నాటికి ఉత్తరప్రదేశ్‌లో 1,13,938 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉండేవని తెలిపారు. అయితే అప్పటి నుంచి 26,000కు పైగా పాఠశాలలు మూతపడ్డాయని ఆరోపించారు.

## లష్కర్ బోనాల జాతర షురూ

### ఉజ్జయిని మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**తొలి సమయం హైదరాబాద్**

లష్కర్ బోనాలు అంగరంగ వైభవంగా ప్రారంభ మయ్యాయి. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయానికి వస్తున్న భక్తులతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి.ఇదిలా ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తొలి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. కాగా, భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాధారణ భక్తుల కోసం మూడు క్యూలైన్లు, బోనాలు సమర్పించేందుకు వచ్చిన భక్తుల కోసం రెండు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అలాగే వీఐపీలకు మరో క్యూలైన్ ఏర్పాటు చేశారు.



వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సెంటర్లను ఏర్పాటుచేశారు. బందోబస్త్‌లో సుమారు 1500 మంది పాల్గొన్నట్లు తెలుస్తోంది.

## భూమికి ఆధార్ లాంటి 'భూధార్' నంబర్ మంత్రి పొంగులేటి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్న మంత్రి

భూ అక్రమ లావాదేవీలపై త్వరలో ఫాస్ట్ ట్రాక్ విచారణ జరుపుతామని వెల్లడి

ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో 'భూధార్' నంబర్ కేటాయిస్తామన్న పొంగులేటి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిధుల కొరత ఉండదని హామీ

**తొలి సమయం హైదరాబాద్**

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వేదికగా జరిగిన భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. పేదల భూములను అక్రమంగా చేజిక్కించుకున్న వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ అక్రమాలపై త్వరలోనే ఫాస్ట్ ట్రాక్ విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## కులాలకు అతీతంగా జరిపే అద్భుత పండుగ బోనాలు: కేటీఆర్

**తొలి సమయం హైదరాబాద్**

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ఇరాన్‌తో యుద్ధం

### కీలక నిర్ణయం తీసుకున్న డొనాల్డ్ ట్రంప్



ఇరాన్ పై యుద్ధం విష యం లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసు కున్నారు. ఆ దేశంపై తలపెట్టిన సైనిక దాడి ప్రణా ళికలను రద్దు చేసుకోనున్నట్లు వెల్లడించారు. హర్మూజ్ జలసంధిను తిరిగి పూర్తిగా తెరవడం, ఇరాన్ అణు ముప్పును అంతం చేయడం వంటి అంశాలతో కూడిన ప్రతిపాదిత ఒప్పందాన్ని ఖరారు చేయడానికి మరింత సమయం కావాలని ఇరాన్, ఇతర పశ్చిమాసియా దేశాలు కోరినట్లు తెలిపారు.

## రెండేళ్ల అజ్ఞాతం వీడనున్న హసీనా

### ఆగస్టు 5న ఏం చెబుతారామె..!




## ఏపీ అభివృద్ధిలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం

### మంత్రి లోకేశ్ చొరవతో 4 ఎంఓయూలు

ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య నాలుగు కీలక రంగాల్లో వ్యూహాత్మక ఒప్పందాలు

గతంలో మంత్రి లోకేశ్ పర్యటనకు కొనసాగింపుగా కుదిరిన ఎంఓయూలు

ఏపీలో సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

ఆటిజం విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

యువతకు ప్రపంచస్థాయి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్న మంత్రి లోకేశ్

**తొలి సమయం హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇరుప్రాంతాల మధ్య అభివృద్ధి, నైపుణ్యం, ఆవిష్కరణలే లక్ష్యంగా నాలుగు కీలక రంగాల్లో వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి.




## స్వర్ణ సంబరం

### కామన్వెల్త్‌లో భారత్ జైత్రయాత్ర

- బాక్సింగ్‌లో ఏడు స్వర్ణాలతో చరిత్ర సృష్టించిన భారత బాక్సర్లు
- జూడో, పారా అథ్లెటిక్స్, అథ్లెటిక్స్‌లోనూ పతకాల వర్షం
- మొత్తం 39 పతకాలతో నాలుగో స్థానంలో భారత్.. స్వర్ణాల జోరు కొనసాగింపు

**తొలి సమయం హైదరాబాద్**

కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు స్వర్ణ పతకాల వర్షం కురిపిస్తూ దేశ కీర్తిని అంతర్జాతీయ వేదికపై మరోసారి చాటిచెప్పారు. ఒకే రోజు ఎనిమిది స్వర్ణ పతకాలు సాధించిన భారత్, మొత్తం 39 పతకాలతో పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది.

# మహిళా బాక్సర్లు భళా..

## ప్రీతి, జాస్మిన్ పసిడి పంచ్..!

గ్లాస్గో: కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్ల స్వర్ణాల వేట మొదలైంది. అందరికంటే ముందుగా ఫైనల్‌కు దూసుకెళ్లిన ప్రీతి పవార్ పసిడి పతకం కొల్లగొట్టింది. మహిళల 54 కిలోల విభాగంలో తిరుగులేని ఆటతో ప్రత్యర్థులను బెంబేలెత్తించిన ప్రీతి.. ఫైనల్లోనూ కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నా డెల్గాడోపై పంచ్‌ల వర్షం కురిపించింది. కాసేపటికే జస్మినే లంబోరియా సైతం తగ్గేదేలే అంటూ ఉత్తర ఐర్లాండ్ బాక్సర్‌ను మట్టికరిపించి గోల్డ్ మెడల్ సాధించింది.

కామన్వెల్త్ క్రీడల పదోరోజు బాక్సర్ ప్రీతి పవార్ పసిడి పతకంతో మెరిసింది. మహిళల 48 కిలోల విభాగం సెమీఫైనల్లో అదిరే పంచ్‌లతో జాంబియాకు చెందిన జ్వాపేను మట్టికరిపించిన ప్రీతి.. ఫైనల్లోనూ చెలరేగిపోయింది. రెండు రౌండ్లలో జోరు చూపించిన భారత బాక్సర్ ధాటికి కెనడా బాక్సర్ స్కార్లెట్ సవన్నా డెల్గాడో చేతులెత్తేసింది.

ఇక 57వ విభాగంలో రెచ్చిపోయిన జస్మినే సైతం స్వర్ణం పట్టేసింది. ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన మైఖేల్ వాల్ష్‌కు ఏమాత్రం అవకాశమివ్వని భారత బాక్సర్ 5-0తో గోల్డ్ మెడల్ సొంతం చేసుకుంది. వరల్డ్ ఛాంపియన్ అయిన జాస్మినే కామన్వెల్త్‌లో పసిడి గెలిచి 57 కిలోల విభాగంలో తనకు తిరుగులేదని చాటింది. వీరిద్దరూ పోడియంపై నిల్చోవడంతో నేరుగా సెమీస్ చేరిన లొవ్లీనా బొర్గోహైన్ కూడా పసిడి సాధించాలని కోరుకుంటున్నారంతా.






# జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు సిల్వర్..

## యశ్వీర్ సింగ్‌కు కాంస్యం




గ్లాస్‌గో: భారత జావెలిన్ స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడల్లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన చివరి త్రోతో యశ్వీర్ అనూహ్య రీతిలో మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన 28 ఏళ్ల నీరజ్ చోప్రా .. కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండో అటెంప్ట్‌లో 85.83 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావించారు. కానీ పాక్ అథ్లెట్ అనుకోని రీతిలో నిష్క్రమించాడు. ఇటీవల వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరగే సత్తా చాటాడు. అతను జావెలిన్‌ను 89.75 మీటర్ల దూరం విసిరి బంగారం పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

గ్లాస్‌గోలో ప్రస్తుతం చల్లని వాతావరణం ఉన్నది. బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో జావెలిన్‌ను సుమారు 90 మీటర్ల దూరం వరకు విసరడం అంత సులువైన అంశం కాదు. ఈ సీజన్‌లో జావెలిన్‌ను 90 మీటర్ల మార్క్ దాటించిన ఏకైక క్రీడాకారుడి జాబితాలో రుమేశ్ తరంగ ఉన్నాడు. ఇక ఈవెంట్‌లో 24 ఏళ్ల యశ్వీర్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. తొలిసారి కామన్‌వెల్త్ గేమ్స్ ఆడుతున్న అతను.. అందర్నీ స్టన్ చేస్తూ తన జావెలిన్‌ను 85.41 మీటర్ల దూరం విసిరాడు. తన చివరి ఆరో ప్రయత్నంలో అతను ఆ దూరానికి జావెలిన్‌ను విసిరి ఇండియాకు పతకాల సంఖ్యను పెంచేశాడు.

# ట్రిపుల్ జంపులో డబుల్ బొనాంజా..

## డెకాథ్లాన్‌లో తొలి పతకం..!



గ్లాస్గో: కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు అదరగొట్టారు. ట్రిపుల్ జంప్ క్వాలిఫయింగ్‌లో మెరిసిన ప్రవీణ్ చిత్రవేల్, సెల్వ ప్రభు తిరుమరన్‌లు ఫైనల్లోనూ సత్తా చాటి పతకాలు సాధించారు. శనివారం జరిగిన ఫైనల్లో ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరం దూకి వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. డెకథ్లాన్‌లో దేశానికి మొట్ట మొదటి పతకం అందించాడు తేజస్విన్ శంకర్. పోడియం మీద ఈ ముగ్గురూ సగర్వంగా పతకాలు స్వీకరించి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు.

గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు పదో రోజు కూడా పతకాల వేట కొనసాగించారు. బాక్సర్లు ప్రీతి పవర్, జాస్మినె లంబోరియాలు స్వర్ణాలు అందించగా.. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ రజతం, సెల్వ ప్రభు కాంస్యంతో మెరిశారు.

ఉత్కంఠగా సాగిన ఫైనల్లో ప్రవీణ్ ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరంతో వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మొదట 16.05 మీటర్లు దూకిన ప్రవీణ్.. నాలుగో ప్రయత్నంలో 16.58 మీటర్ల మార్క్ అందుకున్నాడు. సెల్వ సైతం 15.87 మీటర్ల నుంచి.. నాలుగో ప్రయత్నంలో 16.52 మీటర్ల దూరంతో కాంస్యం గెలిచాడు.

### 7,976 పాయింట్లు

ఇక పది క్రీడల డెకాథ్లాన్ పోటీల్లో తేజస్విన్ శంకర్ దేశానికి మొట్టమొదటి పతకం అందించాడు. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, 400 మీటర్లు, జావెలిన్ త్రో, పోల్ వాల్ట్, 1500 మీటర్ల పరుగులో సత్తా చాటిన తేజస్విన్ 7,976 పాయింట్లు సాధించి, కాంస్యంతో యావత్ దేశం గర్వపడేలా చేశాడు. గాయం బాధించినా సరే దేశం కోసం పతకం గెలవాలనే కసితో పోటీపడిన తేజస్వీపై ప్రశంసలు కురుస్తున్నాయి.




# బిజినెస్ Business

# 3 నిమిషాల్లో బుకింగ్స్ ఖాళీ..

**రాయల్ ఎన్‌ఫీల్డ్ స్పెషల్ బైక్‌కు భారీ డిమాండ్**

**మూడు నిమిషాల్లో 25 బైక్‌లు విక్రయం**

**ప్రపంచవ్యాప్తంగా 100 యూనిట్లకే పరిమితం**

**భారత్‌లో భారీ డిమాండ్, 9 వేల మంది ఆసక్తి నమోదు**

**ప్రత్యేక రంగులు, గోల్డ్ స్ట్రైప్స్‌తో ఆకర్షణ**

**ప్రతి బైక్‌కు ప్రత్యేక నంబర్**

**648 సీసీ ఇంజిన్‌లో మార్పులేమీ లేవు**



న్యూఢిల్లీ: రాయల్ ఎన్‌ఫీల్డ్ తీసుకొచ్చిన పరిమిత ఎడిషన్ 'షాట్‌గన్ 650 ఎక్స్ రఫ్ (క్రాఫ్ట్)' బైక్‌కు ఊహించని స్థాయిలో స్పందన లభించింది. బుకింగ్‌లు ప్రారంభమైన మూడు నిమిషాల్లోనే భారత మార్కెట్‌కు కేటాయించిన 25 బైక్‌లు పూర్తిగా అమ్ముడయ్యాయి. బైక్‌లు సేకరించే వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ ఎడిషన్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ కనిపించింది.

ఈ స్పెషల్ ఎడిషన్‌ను తైవాన్‌కు చెందిన ప్రముఖ కస్టమ్ బైక్ బిల్డర్ విన్‌స్టన్ యెహ్ (రఫ్ (క్రాఫ్ట్)తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ అభివృద్ధి చేసింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 100 బైక్‌లను మాత్రమే తయారు చేసింది. వాటిలో భారత్‌కు 25 యూనిట్లు కేటాయించింది. బుకింగ్‌లు ప్రారంభమైన వెంటనే అన్నీ అమ్ముడయ్యాయి. ఈ బైక్‌పై ప్రపంచవ్యాప్తంగా 9 వేల మందికి పైగా ఆసక్తి నమోదు చేసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఈ బైక్‌కు డిజైన్ పరంగా ప్రత్యేక ఆకర్షణ కల్పించారు. గ్లోస్ జెట్ బ్లాక్, మ్యాట్ స్టెల్త్ బ్లాక్ రంగుల కలయికతో పాటు చేతితో వేసిన గోల్డ్ లీఫ్ స్ట్రైప్స్, గ్రే హైలైట్స్, కాస్ట్ బ్రాస్ బ్యాడ్జ్‌ను అందించారు. ప్రతి బైక్‌కు ప్రత్యేక సీరియల్ నంబర్‌తో కూడిన ఫ్యూయల్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. బ్లాక్ బార్ ఎండ్ మిర్రర్లు, క్విల్టెడ్ లెదర్ సీట్లు, కాంట్రాస్ట్ కట్ అల్లాయ్ వీల్స్, బంగారు రంగు ఫ్రంట్ ఫోర్క్‌లు ఈ ఎడిషన్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి.

అయితే ఇంజిన్‌లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. సాధారణ షాట్‌గన్ 650లో ఉన్న 648 సీసీ ప్యారలల్ ట్విన్, ఎయిర్/ఆయిల్ కూల్డ్ ఇంజిన్‌నే ఇందులో కూడా ఉపయోగించారు. ఇది 47 హెచ్‌పీ శక్తి, 52.3 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి 6-స్పీడ్ గేర్‌బాక్స్‌ను జత చేశారు.

# ఆర్థిక వ్యవస్థ జోరు..

**14 నెలల రికార్డు స్థాయికి జీఎస్‌టీ వసూళ్లు**

**జులైలో జీఎస్‌టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లు**

**వార్షిక ప్రాతిపదికన 15.4 శాతం వృద్ధి**

**14 నెలల్లో అత్యధిక వృద్ధి నమోదు**

**దిగుమతుల జీఎస్‌టీ ఆదాయం 28.8 శాతం పెరుగుదల**

**నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లు**

**తొలి నాలుగు నెలల వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లు**




న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జులైలో భారీగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే 15.4 శాతం వృద్ధితో రూ.2.11 లక్షల కోట్లకు చేరాయి. గత 14 నెలల్లో నమోదైన అత్యధిక వార్షిక వృద్ధి ఇదేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

2026-27 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ జీఎస్‌టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మార్కు దాటడం ఇది రెండోసారి. దేశీయ వినియోగం పెరగడం, వ్యాపార కార్యకలాపాలు పుంజుకోవడమే ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. గత ఏడాది జులైలో రూ.1.83 లక్షల కోట్లుగా ఉన్న స్థూల జీఎస్‌టీ వసూళ్లు, ఈసారి రూ.2.11 లక్షల కోట్లకు చేరాయి.

దేశీయ జీఎస్‌టీ ఆదాయం కూడా 10.1 శాతం పెరిగింది. గత ఏడాది జులైలో రూ.1.31 లక్షల కోట్లుగా ఉన్న ఈ వసూళ్లు, ఈసారి రూ.1.45 లక్షల కోట్లకు పెరిగాయి. దిగుమతులపై జీఎస్‌టీ వసూళ్లు మరింత వేగంగా పెరిగాయి. 28.8 శాతం వృద్ధితో రూ.66,511 కోట్లకు చేరాయి. దీంతో మొత్తం స్థూల జీఎస్‌టీ వసూళ్లలో దిగుమతుల వాటా గణనీయంగా పెరిగింది.

జులైలో జీఎస్‌టీ రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లుగా నమోదయ్యాయి. రీఫండ్‌లను మినహాయించిన తర్వాత నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లుగా నిలిచింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 15.8 శాతం ఎక్కువ. ఇందులో దేశీయ నికర ఆదాయం 10.5 శాతం పెరిగి రూ.1.27 లక్షల కోట్లకు చేరగా, కస్టమ్స్ జీఎస్‌టీ నుంచి వచ్చిన నికర ఆదాయం 30.3 శాతం పెరిగి రూ.54,223 కోట్లుగా నమోదైంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో మొత్తం జీఎస్‌టీ వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.7.66 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంటే 10.1 శాతం వృద్ధి నమోదైంది. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం, జీఎస్‌టీతో పాటు ప్రాథమిక ఎక్సైజ్ సుంకంలో రాష్ట్రాల వాటాను పరిగణనలోకి తీసుకుంటే, 2026-27లో రాష్ట్రాలకు గత ఏడాదితో పోలిస్తే సుమారు రూ.1.43 లక్షల కోట్ల అదనపు ప్రయోజనం లభించే అవకాశం ఉంది.

# 'మెటా' వివరణతో సంతృప్తి చెందని కేంద్రం..

**వివరణకు రానున్న ఫేస్‌బుక్ బృందం**

**ప్రధాని మోదీ ఫేస్‌బుక్ పోస్ట్ కొద్దిసేపు నిలుపుదలపై మెటాతో చర్చించనున్న కేంద్రం**

**వారంలోగా వివరణ ఇచ్చేందుకు భారత్‌కు రానున్న మెటా బృందం**

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు నిలుపుదల చేసిన ఘటనపై సోషల్ మీడియా దిగ్గజం మెటాతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపనుంది. విధానపరమైన, సాంకేతిక అంశాలపై చర్చించేందుకు వారంలోగా మెటా ప్రతినిధులు రానున్నారని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ గురువారం తెలిపారు. పరీక్ష పత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని యువతను ఉద్దేశించి ప్రధాని మోదీ జులై 23న ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్‌ను మెటా కొద్దిసేపు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 'సాంకేతిక లోపం' కారణంగా జరిగిందని పేర్కొంటూ క్షమాపణ చెప్పి, పోస్ట్‌ను పునరుద్ధరించింది. అయితే, ఈ వివరణతో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ సంతృప్తి చెందలేదు. ఈ నేపథ్యంలోనే మెటా పబ్లిక్ పాలసీ హెడ్‌కు సమన్లు జారీ చేసింది.




ఈ అంశంపై ఎస్. కృష్ణన్ మాట్లాడుతూ.. "ఈ ఘటనకు దారితీసిన కారణాలను వివరించడానికి తమ ఉన్నత స్థాయి బృందాన్ని పంపాలని మెటాను కోరాము. వారంలోగా వారు వచ్చి వివరణ ఇస్తారు. ఈ విషయంలో విధానపరమైన, సాంకేతిక పరమైన అంశాలను పూర్తిగా అర్థం చేసుకోవాలనుకుంటున్నాం. భారత్ ఆందోళనలకు అనుగుణంగా వారు వ్యవహరించాల్సి ఉంటుంది. చర్చించేందుకు మా వద్ద చాలా అంశాలున్నాయి'' అని స్పష్టం చేశారు.

ఈ ఘటన తర్వాత, ప్రధాని మోదీతో పాటు ఇతర ప్రముఖుల ఖాతాల విషయంలో కఠినమైన, మెరుగైన భద్రతా ప్రమాణాలను అమలు చేసినట్లు మెటా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసినట్లు సమాచారం. ఇకపై ఇలాంటి ఖాతాలపై ఏదైనా చర్య తీసుకునే ముందు, కనీసం ఇద్దరు సీనియర్ అధికారుల బృందం సమీక్షించాల్సి ఉంటుందని మెటా తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.



# పెళ్లి చుట్టూ సాగే కథతో క్రేజీ కల్యాణం

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'క్రేజీ కల్యాణం'. భద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం చిత్ర యూనిట్ విడుదల చేసింది. నవ్వులు, భావోద్వేగాలు, ఊహించని మలుపులతో కూడిన ఈ టీజర్, ఒక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందిస్తామని హామీ ఇస్తోంది. టీజర్ ప్రారంభంలో.. తండ్రి పాత్రలో నటిస్తున్న డాక్టర్ నరేశ్, తన కూతురు కీర్తి (అనుపమ) పెళ్లిని ఎంత ఘనంగా చేయాలనుకుంటున్నారో ప్రేమగా చెబుతారు. "నీ పెళ్లిని అంగరంగ వైభవంగా జరిపిస్తా" అంటూ ఆయన చెప్పే మాటలు ఆకట్టుకుంటాయి. అయితే, తండ్రి ఆశలకు భిన్నంగా కీర్తికి వేరే ప్రణాళికలు ఉన్నట్టు తెలుస్తోంది. "నీ కొడుకు ఒక్కడే మొండివాడు అనుకుంటున్నావా? నాలోనూ అదే రక్తం ప్రవహిస్తోంది" అని నానమ్మతో అనుపమ చెప్పే డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. తన అన్నకు తన పెద్దల్లుడి కంటే దరిద్రుడైన అల్లుడు రావాలని నరేశ్ దేవుడికి మొక్కుకోవడం, మంచంపై పడుకున్న వ్యక్తిపై అనుపమ కారం చల్లడం వంటి సన్నివేశాలు కడుపుబ్బ నవ్విస్తున్నాయి. మొత్తం మీద ఈ టీజర్ ఒక క్రేజీ వెడ్డింగ్ సెలబ్రేషన్‌ను తెరపై చూపిస్తుందనే అంచనాలను పెంచింది. ఈ చిత్రంతో భద్రప్ప గాజుల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యారో సినిమాస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాలో నరేశ్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ ఉద్దేమరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సురేశ్ బొబ్బిలి సంగీతం అందిస్తుండగా, శ్యామ్ దూపాటి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.





# కొరియన్ కనకరాజు ట్రైలర్ విడుదల

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితిక నాయక్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మూవీ ట్రైలర్‌ను విడుదల చేసింది. థ్రిల్, హాస్యం, హారర్ అంశాలను మేళవించి మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. సత్య కీలక పాత్ర పోషిస్తున్న ఈమూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.




# జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల






ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు. రష్యాలో జన్మించినప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ కూడా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల కూడా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

# జాతీయ కథల పోటీలో ద్వితీయ బహుమతి గ్రహీత రచయిత సుదర్శనం రంగనాథ్‌కు ఇల్లందులో ఘన సన్మానం.

**తొలి సమయం, ఇల్లందు!ఆగస్టు, 02**

ముల్కనూర్ సాహితీ పీఠం మరియు నమస్తే తెలంగాణ దినపత్రిక సంయుక్తంగా నిర్వహించిన జాతీయ కథల పోటీలో "కాఫీర్" కథకు ద్వితీయ బహుమతి లభించిన సందర్భంగా ఆ కథ రచయిత శ్రీ సుదర్శనం రంగనాథ్ గారిని నిర్వాహకులు ఇటీవల ముల్కనూర్ మండల కేంద్రంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రూ. 25 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక (మెమెంటో) అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని, ఇల్లందు పట్టణానికి చెందిన కోరగుట్ట వాకర్స్ మరియు సింగరేణి బ్లాక్ డైమండ్ వాకర్స్ సభ్యులు ఆదివారం ఇల్లందు పట్టణంలోని జేకే హైస్కూల్ గ్రౌండ్స్‌లో శ్రీ సుదర్శనం రంగనాథ్ గారిని శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తనను అభినందించి సన్మానించిన కోరగుట్ట వాకర్స్, సింగరేణి బ్లాక్ డైమండ్ వాకర్స్ సభ్యులకు శ్రీ సుదర్శనం రంగనాథ్ గారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



PUBLICATIONS AND PRINTERING BY VEMULA AYODHYA RAMULU, H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506101, TELTEL NO 12283, PHONE NUMBER 9000689544...